ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి

- వందల డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్
- 99 శాతం కూల్చివేశామన్న ఇజ్రాయెల్ సైన్యం
- ఎదురుదాడి చేస్తే తీవ్ర పరిణామాలు: ఇరాన్ హెచ్చరిక
- మేమూ తగిన విధంగా స్పందిస్తాం: నెతన్యాహూ
- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన
- శాంతి మార్గంలో సమస్య పరిష్కారానికి పిలుపు

టెహ్రాన్/టెల్‌అవివ్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ఊహించినట్టుగానే ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడికి దిగింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇజ్రాయెల్ భూభాగంపైకి డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. దీంతో ఇజ్రాయెల్ వ్యాప్తంగా ఎయిర్ రైడ్ సైరన్‌లు వినిపించాయి. అయితే 'బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ'ను ఉపయోగించి.. ఇరాన్ ప్రయోగించిన 300కు పైగా డ్రోన్లు, క్షిపణుల్లో 99 శాతం కూల్చివేసినట్టు ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం ప్రకటించింది. ఇరాన్ దాడులను వ్యూహాత్మకంగా తిప్పికొట్టామని ఆర్మీ అధికార ప్రతినిధి డానియెల్ హగేరీ పేర్కొన్నారు. ఇరాన్ తమ భూభాగంపైకి 170 డ్రోన్లు, 30కి పైగా క్రూయిజ్ క్షిపణులు, 120కి పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తెలిపారు. మొత్తంగా వీటిల్లో కొన్ని బాలిస్టిక్ క్షిపణులు మాత్రమే ఇజ్రాయెల్ భూభాగంపైకి వచ్చాయని, ఒక ఎయిర్ బేస్‌కు స్వల్ప నష్టం చేకూరిందని, అయితే అది ఇప్పటికీ పనిచేస్తుందని వెల్లడించారు. కాగా, తమ లక్ష్యాన్ని సాధించామని, ఆదివారం ఉదయానికి దాడి ముగిసిందని ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆపరేషన్ కొనసాగించే అవకాశం లేదని ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మహ్మద్ హుస్సేన్ భగేరీ పేర్కొన్నారు. మరోవైపు తమ దేశ గగనతలాన్ని రీఓపెన్ చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. రెండు వారాల క్రితం సిరియా రాజధాని డమాస్కస్‌లోని తమ కాన్సులేట్ కార్యాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ తాజా దాడులు చేసింది.

ఇజ్రాయెల్‌లోని జెరూసలెంపై దాడి చేస్తున్న ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు

ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా, హౌతీ రెబల్స్ దాడులు

ఇజ్రాయెల్‌లోని పలు భూభాగాలపైకి ఇరాన్ మద్దతు గల లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూపు, యెమెన్‌లోని హౌతీ రెబల్స్ కూడా పలు రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించారు. ఇరాన్ దాడుల్లో 12 మందికి గాయాలయ్యాయని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని బెడౌయిన్ అరబ్ పట్టణంలో ఏడేండ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయని రెస్క్యూ బృందాలు తెలిపాయి. అయితే ఇరాన్ దాడులతో పాప గాయపడిందా? అనేదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యక్ష దాడులు ఇదే తొలిసారి

ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్షంగా దాడులు చేయడం ఇదే తొలిసారి. 'మేం అడ్డుకొన్నాం. బ్లాక్ చేశాం. కలిసి విజయం సాధించాం' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పటికీ ఇజ్రాయెల్ అప్రమత్తంగా ఉన్నదని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రక్షణ మంత్రి యోవ్ గాల్లంట్ తెలిపారు. ఇరాన్ దాడిని అడ్డుకోవడంలో ఇజ్రాయెల్‌కు అమెరికా దళాలు సహకరించాయని, ఇజ్రాయెల్‌కు 'ఇనుప కవచం'లా అండగా ఉంటామని ఆ దేశ అధ్యక్షుడు బైడెన్ తెలిపారు. అయితే ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఎదురుదాడులు చేస్తే తాము భాగస్వామ్యం కాబోమని నెతన్యాహూతో బైడెన్ పేర్కొన్నట్టు సమాచారం.

వాళ్లను వదిలిపెట్టేది లేదు: నెతన్యాహూ

ఇరాన్ దాడుల తర్వాత ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహూ వార్ క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆయన అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్ ప్రత్యక్ష దాడిని తిప్పికొట్టేందుకు ఇజ్రాయెల్ గత కొన్నేండ్లుగా, ప్రధానంగా గత కొన్ని వారాలుగా సంసిద్ధమైందని నెతన్యాహూ పేర్కొన్నారు. తమకు హాని తలబెట్టిన వారికి తాము కూడా ఇదేరీతిలో సమాధానం ఇస్తామని హెచ్చరించారు.

ప్రతిదాడికి దిగితే తీవ్ర పరిణామాలు: రైసీ

ప్రతిదాడులకు పాల్పడితే ఇజ్రాయెల్, అమెరికా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ కానీ, దాని మద్దతు దేశాలు గానీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, బలమైన ప్రతిస్పందన తెలియజేస్తామని ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతకుముందు ఇరాన్ మిలటరీ చీఫ్ మహ్మద్ భగేరీ కూడా మాట్లాడుతూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రతిదాడులకు పాల్పడితే, ఇజ్రాయెల్ 'అతిపెద్ద' స్పందన కోసం వేచిచూడాల్సి ఉంటుందన్నారు. ఇజ్రాయెల్ ప్రతిదాడులకు సహకరిస్తే, అమెరికా సైనిక బేస్‌లను లక్ష్యంగా చేసుకొంటామని హెచ్చరించారు.

ప్రపంచం మరో యుద్ధాన్ని భరించలేదు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడిని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఖండించారు. పశ్చిమాసియా గానీ, యావత్తు ప్రపంచం కానీ మరో యుద్ధాన్ని భరించలేదని అన్నారు. సైనిక ఘర్షణలకు దారితీసే ఎలాంటి చర్యలకైనా దూరంగా ఉండాలని, సంయమనం పాటించాలని కోరారు. శత్రుత్వాన్ని వీడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇరాన్ దాడులను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఖండించారు. ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని తెలిపారు. జర్మనీ, ఫ్రాన్స్, యూకే, ఉక్రెయిన్ దేశాల నేతలు కూడా ఇజ్రాయెల్‌పై దాడులను ఖండించారు. దీంతో జర్మనీ, ఫ్రాన్స్, యూకే రాయబారులకు ఇరాన్ సమన్లు ఇచ్చింది.

భారతీయులకు అడ్వైజరీ జారీ

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్‌లోని భారత పౌరులకు ఇండియన్ మిషన్లు ముఖ్యమైన అడ్వైజరీ జారీచేశాయి. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు జారీచేసే సేఫ్టీ ప్రొటోకాల్స్ పాటించాలని సూచించాయి. ప్రస్తుత పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, భారతీయుల సురక్షితపై అధికారులు, ప్రవాస సంఘాలతో సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిపాయి. వెబ్‌సైట్ లింక్ ద్వారా రాయబార కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో టెల్‌అవివ్‌కు రాకపోకలు సాగించే విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ఎయిరిండియా ఆదివారం వెల్లడించింది.

దౌత్య చర్చలు జరుపాలి: భారత్

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది ప్రాంతీయ శాంతిభద్రతలకు ముప్పు కలిగిస్తుందని అభిప్రాయపడింది. ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, హింసకు దూరంగా ఉండాలని, దౌత్య మార్గంలో చర్చలు జరుపాలని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో కోరింది. మరోవైపు ఇరాన్ స్వాధీనం చేసుకున్న నౌకలోని భారతీయులను విడిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు పేర్కొన్నది.

45 ఏండ్ల వైరం!

టెల్ అవివ్: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం ఈ నాటిది కాదు. దాదాపు అర్ధ శతాబ్దం క్రితమే ఈ రెండు దేశాల మధ్య వైరం ప్రారంభమైంది. గతంలో అమెరికాతో జతకట్టిన పహ్లావీ రాజవంశం 1979లో ఇరాన్ విప్లవంతో అధికార పీఠాన్ని కోల్పోయింది. అనంతరం ఇరాన్ పాలనా పగ్గాలను చేపట్టిన అయతుల్లా ఖమేనీ వర్గం అమెరికా పట్ల దేశ వైఖరిని మార్చేసింది. అమెరికాను 'మహా సాతాను'గా, ఇరాన్ చివరి చక్రవర్తి మొహమ్మద్ రెజా పహ్లావీకి మద్దతు తెలుపుతున్న ఇజ్రాయెల్‌ను 'చిన్న సాతాను'గా అభివర్ణించింది. నాటి నుంచి టెహ్రాన్-టెల్ అవీవ్ మధ్య శత్రుత్వం క్రమంగా పెరగడంతో ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నదని ఖమేనీ ఆరోపించారు. దీంతో దశాబ్దాల నుంచే రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. కానీ, ఆ దాడుల్లో తమ ప్రమేయం లేదని రెండు దేశాలు ఖండించడంతో ఈ సంఘర్షణను 'షాడో వార్' అని పిలవడం మొదలుపెట్టారు. ఈ షాడో వార్‌కు లెబనాన్, సిరియా యుద్ధవేదికలుగా ఆవిర్భవించాయి. లెబనాన్ భూభాగం నుంచి ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తున్న హెజ్బొల్లా గ్రూపునకు ఇరాన్ అండగా నిలిచింది. మరోవైపు సిరియా భూభాగంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగడంతో సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు కూడా ఇరాన్ మద్దతు తెలిపింది. ఈ క్రమంలో 1967 యుద్ధం తర్వాత సిరియాలోని గోలన్ హైట్స్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించుకున్నది. నాటి నుంచి సిరియా, లెబనాన్‌పై దాడులు జరిపేందుకు గోలన్ హైట్స్‌ను ఇజ్రాయెల్ ఉపయోగించుకుంటున్నది.

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడితో..

నిరుడు అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన భీకర దాడుల్లో తమ పాత్ర లేదని ఇరాన్ బహిరంగంగా ప్రకటించినప్పటికీ ఇజ్రాయెల్ నగరాలపై హమాస్ దాడిని స్వాగతించింది. ఆ వెంటనే గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడులకు దిగడంతో ఇప్పటి వరకు 33 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మృతిచెందినట్టు ఐక్యరాజ్య సమితి అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు హమాస్‌కు మద్దతుగా లెబనాన్ నుంచి హెజ్బొల్లా దళాలు ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 1న ఇజ్రాయెల్‌కు చెందినవిగా అనుమానిస్తున్న కొన్ని యుద్ధ విమానాలు సిరియాలోని ఇరాన్ రాయబార కార్యాలయంపై బాంబు దాడి చేశాయి. ఈ దాడిలో సీనియర్ కమాండర్లు సహా ఏడుగురు అధిదారులు మృతి చెందినట్టు ఇరాన్ వెల్లడించింది. దీనికి ప్రతీకారం తీర్చుకోవడంలో భాగంగానే తాజాగా ఇజ్రాయెల్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిపింది.

బహుళ అంచెల రక్షా కవచం

శత్రు దుర్భేద్యం.. ఇజ్రాయెల్ గగనతలం

జెరూసలేం, ఏప్రిల్ 14: ఇరాన్ నుంచి దూసుకొచ్చిన వందల డ్రోన్లు, క్షిపణి దాడులను ఇజ్రాయెల్ బహుళ అంచెల రక్షణ వ్యవస్థ సమర్థంగా ఎదుర్కొంది. 99 శాతం డ్రోన్లను కూల్చివేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. శత్రు దేశాల దాడులను ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ అత్యాధునిక సాంకేతికతతో బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థను రూపొందించింది. ఇందులో ఒక్కో విభాగం ఒక్కో విధంగా పనిచేస్తూ శత్రుదాడులను సమర్థంగా తిప్పికొట్టగలవు. ది యారో, డేవిడ్స్ స్లింగ్, పేట్రియాట్, ఐరన్ డోమ్, ఇరన్ బీమ్ వ్యవస్థలు ఇజ్రాయెల్‌కు రక్షా కవచంగా నిలుస్తున్నాయి. అవి ఎలా పనిచేస్తాయో చూద్దాం..

ది యారో: ఆవరణానికి ఆవల దీన్ని ఆపరేట్ చేస్తారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను కూల్చేందుకు దీనిని ఉపయోగిస్తారు. దీన్ని అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ అభివృద్ధి చేసింది. యెమెన్ నుంచి హౌతీ మిలిటెంట్లు ప్రయోగిస్తున్న క్షిపణులను అడ్డుకునేందుకు ప్రస్తుతం దీన్ని వాడుతున్నారు.

డేవిడ్స్ స్లింగ్: దీన్ని కూడా అమెరికాతో కలిసి అభివృద్ధి చేసింది. ఇది మధ్యస్థాయి క్షిపణులను అడ్డుకుంటుంది. లెబనాన్ నుంచి హెజ్బొల్లా మిలిటెంట్లు ప్రయోగించే క్షిపణులను అడ్డుకునేందుకు దీన్ని వాడుతున్నారు.

పేట్రియాట్: ఇజ్రాయెల్ డిఫెన్స్ వ్యవస్థల్లో ఇదే పురాతనమైనది.



1991లో మొదటి గల్ఫ్ యుద్ధంలో ఇరాక్ ప్రయోగించిన స్కడ్ మిస్సైల్స్‌ను అడ్డుకునేందుకు దీనిని వాడారు. ఇది ఇది అమెరికా తయారుచేసిన వ్యవస్థ. ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్స్, డ్రోన్లను కూల్చేందుకు వాడుతున్నారు.

ఐరన్ డోమ్: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ. స్వల్పశ్రేణి రాకెట్ల దాడులను ఇది సమర్థంగా అడ్డుకొంటుంది. దీని సక్సెస్ రేటు 90 శాతం. ప్రస్తుత యుద్ధంలో హమాస్, హెజ్బొల్లా దాడులను అడ్డుకునేందుకు దీన్ని వినియోగిస్తున్నారు.

ఐరన్ బీమ్: ఇజ్రాయెల్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న ఈ వ్యవస్థ.. లేజర్ టెక్నాలజీ ద్వారా శత్రు ముప్పులను ఎదుర్కొంటుంది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థల కంటే ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావడంతో దీన్ని గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్నారు. అయితే ఈ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాలేదు.

బీజేపీకి ఓటేయొద్దు

ఈపీఎఫ్ పింఛనుదారుల పిలుపు

బాలాసోర్, ఏప్రిల్ 14: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీయే కూటమి పార్టీలకు వ్యతిరేకంగా ఓటేయాలని ఆల్ ఒడిశా ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ తమ సభ్యులు, వారి కుటుంబాలకు పిలుపునిచ్చింది. కనీస పింఛనుకు సంబంధించి కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఎన్డీయే పార్టీలకు వ్యతిరేకంగా ఓటేయాలని బాలాసోర్‌లో జరిగిన ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. వివిధ కార్పొరేషన్లు, ప్రైవేటు సంస్థల నుంచి రిటైర్డ్ అయిన వారిలో చాలా మంది చాలా తక్కువ పింఛను పొందుతున్నారని, నెలకు రూ.వెయ్యి కంటే తక్కువ పింఛనుగా వస్తున్నదని అసోసియేషన్ పేర్కొన్నది. ఈపీఎఫ్ లబ్ధిదారులుగా ఉన్నవాళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య బీమా పథకాలు వర్తించలేదనే విషయాన్ని ఈ సందర్భంగా లేవనెత్తింది. నెలకు కనీస పింఛను రూ.9 వేలతోపాటుగా డీఏ ఇవ్వాలని డిమాండ్ చేసింది. పార్లమెంటరీ కమిటీ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించింది.

మండిలో కింగ్ వర్సెస్ క్వీన్

కంగన రనౌత్‌పై రాజా విక్రమాదిత్యసింగ్ పోటీ

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి, 'క్వీన్' కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ తరపున రాజవంశీకుడు, మంత్రి రాజా విక్రమాదిత్య సింగ్ పోటీ చేయనున్నారు. విక్రమాదిత్య తండ్రి వీరభద్ర సింగ్ ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆయన తల్లి ప్రతిభా సింగ్ ఈ నియోజకవర్గం సిట్టింగ్ ఎంపీ, పీసీసీ చీఫ్ కూడా. ఇప్పటి వరకు జరిగిన 19 ఎన్నికల్లో 13 సార్లు రాజ వంశీకులే ఇక్కడి నుంచి గెలిచారు. ఆయన తల్లిదండ్రులు మూడేసి సార్లు ఇక్కడి నుంచి ఎంపీలుగా గెలిచారు. 2021లో ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన తన తల్లి ప్రతిభ తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. కంగనా రనౌత్

బాలీవుడ్ సినిమా 'క్వీన్'లో నటించిన విషయం తెలిసిందే. విక్రమాదిత్య ఆమెను 'వివాదాల రాణి' అంటూ విమర్శించారు. దీనికి ఆమె ప్రతిస్పందిస్తూ, విక్రమాదిత్య 'చోటా పప్పూ' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో వీరిరువురి మధ్య పోటీ రసవత్తరంగా సాగబోతున్నది.

బొమ్మై కుమార స్వామి

కర్ణాటక లోక్‌సభ బరిలో ముగ్గురు మాజీ సీఎంలు

బెంగళూరు: కర్ణాటక లోక్‌సభ బరిలో ముగ్గురు మాజీ సీఎంలు బరిలో నిలిచారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులుగా మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, జగదీశ్‌శెట్టర్, హెచ్‌డీ కుమారస్వామి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. హవేరి నుంచి బొమ్మై, బెళగావి నుంచి శెట్టర్, మండ్య నుంచి కుమారస్వామి బరిలో నిలిచారు. వీరిలో బొమ్మై, శెట్టర్ లింగాయత్ సామాజిక వర్గానికి చెందినవారు కాగా, కుమారస్వామి వొక్కలిగ వర్గానికి చెందినవారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కర్ణాటకకు ఇప్పటి వరకు 23 మంది ముఖ్యమంత్రులుగా పనిచేస్తే అందులో 14 మంది పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించడం విశేషం. వీరిలో ఏడు మంది రాష్ట్ర రాజకీయాల నుంచి వైదొలగి జాతీయ రాజకీయాల్లో రాణించారు. మళ్లీ కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పడితే.. బొమ్మై కూడా గెలిస్తే మోదీ మంత్రివర్గంలో ఆయనకు స్థానం లభించే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు తెలిపాయి. వ్యవసాయ మంత్రి పదవి చేపట్టాలని ఉందని కుమారస్వామి ఇప్పటికే పేర్కొన్నారు.

సీఎంగా మళ్లీ వస్తా!

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ 'సంకల్పం'
- గురు దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు
- మరోసారి తెరపైకి సీఎం మార్పు

కలబురగి, ఏప్రిల్ 14: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య పదవి ఉంటుందా? ఊడుతుందా? అనే అంశంపై రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన గత ఏడాది మే నుంచి చర్చ జరుగుతూనే ఉన్నది. కొన్నిసార్లు అయితే ముఖ్యమంత్రి మార్పు తథ్యమనేలా సాక్షాత్తూ సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లే వ్యాఖ్యలు చేయడం చూశాం. తాజాగా డీకే శివకుమార్ తీసుకొన్న 'సంకల్పం' సీఎం మార్పు అంశాన్ని మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో తెరపైకి తెచ్చింది. శివకుమార్ శుక్రవారం కలబురగి జిల్లా దేవల్ తాలుకాలోని ప్రముఖ గురు దత్తాత్రేయ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర సీఎంగా ఆలయాన్ని దర్శిస్తానని, గురు దత్త ఆశీస్సులు తీసుకొంటాననే సంకల్పాన్ని ఆయన తీసుకొన్నారు. ఆలయంలో డీకే శివకుమార్ చేత ప్రత్యేక పూజలు చేయించిన పూజారి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత మరోసారి సీఎం హోదాలో ఆలయానికి రావాలని సూచించగా, ఇందుకు డీకే శివకుమార్ అంగీకారం తెలిపారు. శివకుమార్‌కు గురు దత్తాత్రేయ ఆశీస్సులు ఉంటాయని పూజారి చెప్పారు.

ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇదే..

గత ఏడాది మే నెలలో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి పదవి విషయంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా మొదటి రెండున్నరేండ్లు సిద్ధరామయ్య, తర్వాత రెండున్నరేండ్లు డీకే శివకుమార్‌కు దక్కేలా ఒక అంతర్గత ఒప్పందం జరిగిందనే వార్తలు వచ్చాయి. తాను సీఎంగా కొనసాగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం సిద్ధరామయ్య ఇటీవల తన సొంత వరుణ నియోజకవర్గంలోని ప్రజలను అభ్యర్థించారు. ఇదే సమయంలో 'నన్ను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు. మీ కోరిక అబద్ధం కాబోదు..' అంటూ మండ్య సభలో శివకుమార్ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకొన్నది.

గురు దత్తాత్రేయ ఆలయంలో పూజలు చేస్తున్న డీకే శివకుమార్

ఉండమంటే ఉంటా.. లేకుంటే దిగిపోతా!

రెండు రోజుల క్రితం కూడా సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ సీఎం పదవి విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే తనకు శిరోధార్యమని, పదవిలో కొనసాగమంటే కొనసాగుతానని, లేదంటే దిగిపోతానని పేర్కొన్నారు. మరోవైపు తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కోట్ల రూపాయలు ఎర చూపుతున్నదని ఆరోపించిన సీఎం సిద్ధరామయ్య.. తన నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్లు కొనసాగుతుందని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలు రిగ్గింగ్ అయినట్లే!

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బీజేపీ: జీన్ డ్రెజ్

రాంచీ: భారత ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉన్నదని, అధికార బీజేపీ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నదని ప్రముఖ ఆర్థిక వేత్త జీన్ డ్రెజ్ ఆరోపించారు. ప్రస్తుత పరిణామాల మధ్య జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు దాదాపు రిగ్గింగ్ అయినట్టే అని పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ విపక్ష పార్టీలను పద్ధతి ప్రకారం లక్ష్యంగా చేసుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు కొన్నేండ్లుగా శల్య పరీక్ష చేస్తూ, వేధిస్తున్నాయన్నారు. బీజేపీకి ముప్పుగా కనిపించే రాజకీయ నేతలు వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో దాదాపు రిగ్గింగ్ జరిగినట్లేనని డ్రెజ్ వ్యాఖ్యానించారు.

లోక్‌సభ బరిలో సల్వా జుడుం నేత కుమారుడు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాడిన సల్వా జుడుం మాజీ నేత చిన్న రామ్ గోటా కుమారుడు ప్రకాశ్ కుమార్ గోటా లోక్‌సభ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా దిగారు. తనకు బీజేపీ, కాంగ్రెస్‌లపై నమ్మకం లేదని, రాష్ట్రంలో మార్పు కోసం తాను కృషి చేస్తానని ప్రకాశ్ తెలిపారు. ఆయన బస్తర్ లోక్‌సభ (ఎస్‌టీ రిజర్వుడు) స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. రాష్ట్రంలో 32 శాతం మంది ఎస్టీలు ఉన్నారని, వారికి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సరైన రీతిలో అందడం లేదని చెప్పారు. మిత్రుల ప్రోత్సాహంతో తాను ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రచారం కోసం అవసరమైన వాహనాలు, ఆర్థిక వనరులను తన మిత్రులు సమకూర్చుతున్నారని చెప్పారు.

ఈశాన్య ఢిల్లీ నుంచి కన్హయ్య కుమార్ పోటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ, పంజాబ్‌లోని లోక్‌సభ స్థానాలకు సంబంధించి 10 మంది అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ ఆదివారం విడుదల చేసింది. జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్‌కు ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం టికెట్ ఇచ్చింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా మనోజ్ తివారీ పోటీచేస్తున్నారు. పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ ఛన్ని జలంధర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఒడిశా అసెంబ్లీ ఎన్నికలకు హస్తం పార్టీ 75 మంది అభ్యర్థులను ప్రకటించింది.

ప్రైవేట్ జెట్లకు భలే గిరాకీ

ఎన్నికల వేళ 40 శాతం పెరిగిన డిమాండ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్లకు డిమాండ్ 40% మేరకు పెరిగింది. దీనివల్ల ఆపరేటర్లకు సుమారు 15-20% అధిక ఆదాయం లభించనుంది. ఈ రంగంలోని నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం, చార్టర్డ్ సర్వీసులకు గంటకు కొంత నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తారు.

ఈ ధరలు కూడా పెరిగిపోయాయి. విమానానికి గంటకు రూ.4.5 లక్షల నుంచి రూ.5.25 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. రెండు ఇంజిన్ల హెలికాప్టర్‌కు గంటకు రూ.1.5 లక్షల నుంచి రూ.1.7 లక్షల వరకు తీసుకుంటున్నారు. హెలికాప్టర్లకు సాధారణ రోజుల్లో ఉండే డిమాండ్ కన్నా ఎన్నికల సమయంలో దాదాపు 25% డిమాండ్ పెరిగింది. అయితే డిమాండ్‌కు సరిపడినన్ని విమానాలు, హెలికాప్టర్లు అందుబాటులో లేవని రోటరీ వింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ (వెస్టర్న్ రీజియన్) కెప్టెన్ ఉదయ్ గెల్లి చెప్పారు. చార్టర్డ్ విమానాలకు మునుపటి ఎన్నికల కంటే ఈసారి 40 శాతం డిమాండ్ పెరిగిందని బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఎండీ కెప్టెన్ ఆర్‌కే బాలి తెలిపారు.